
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
గురువారం, 31 అక్టోబరు 2024
5

5న బీసీ కమిషన్ రాక

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను నిర్ధారించేందుకు రాజకీయపార్టీలు, సంఘాల, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబరు 5న ఖమ్మం జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వకంగా అభిప్రాయాలను, అభ్యర్థనలను నిర్దేశిత నమూనాలో అందజేయాలని ఆయన కోరారు.



వైద్య కళాశాలలో మాయ

- అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు
- అర్హతలేని సిబ్బంది నియామకం
- జీతాల బిల్లుల మంజూరులో వెలుగులోకి...
- ఏసీబీ ట్రాప్ ఘటనతో బయటపడుతున్న బాగోతాలు

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం చోటుచేసుకున్న ఏసీబీ పట్టివేత ఉదంతం చర్చనీయాంశంగా మారింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ రూ.15లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.3లక్షలు తీసుకుంటూ పట్టుబడటం సంచలనం రేపింది. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నుంచి వీరు ఎందుకు అంత పెద్దమొత్తం లంచం డిమాండ్ చేశారు..? అసలు ఉద్యోగాల భర్తీ విషయంలో ఏం జరిగింది..? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 2022 నవంబరులో కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రారంభమైంది. ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) భర్తీ చేశారు. అధ్యాపకేతర సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా దశలవారీగా భర్తీ చేస్తున్నారు.

అర్హత లేని సిబ్బంది నియామకం

కొత్తగూడెం మెడికల్ కళాశాల పరిధిలో సెక్యూరిటీ విభాగం, పేషెంట్ కేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్, సబార్డినేట్, ల్యాబ్ టెక్నీషియన్‌లతో పాటు, శానిటరీ తదితర పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీచేశారు. తొలి నోటిఫికేషన్‌లో 32మందిని రాత పరీక్షలు నిర్వహించి భర్తీ చేశారు. అనంతరం 2వ నోటిఫికేషన్‌లో 49మందిని ఆరు నెలల క్రితం భర్తీ చేశారు. అయితే విద్య, ధ్రువపత్రాలు లేకుండా నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అర్హత లేని సిబ్బందిని నియమించినట్లు పలు ఆరోపణలు బహిర్గతమయ్యాయి. దీంతో 49మందికి ఆరు నెలల కాలం జీత భత్యం విడుదల కాకపోవడంతో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ, ఉద్యోగులు కొత్తగూడెం మెడికల్ కళాశాల అధికారులను జిల్లా యంత్రాంగాన్ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. స్పందించిన మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) రెండున్నర నెలల జీత భత్యాలను బిల్లులు చేసి మంజూరు చేశారు. అనంతరం 23మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నామని సరైన ధ్రువపత్రాలు లేవని, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి మెడికల్ కళాశాల వారు తెలియజేశారు.ఈ క్రమంలో మరోమారు కళాశాలఏవోతో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ సంప్రదింపులు జరిపాయి.

జీతాల బిల్లుల మంజూరులో వెలుగులోకి...

తొలగించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు, మొత్తం 49 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీత భత్యాల బిల్లులు చేయాలంటే రూ.15లక్షల లంచం ఇవ్వాలని కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ డిమాండ్ చేశారు. అంత నగదు ఇచ్చుకోలేమని రెండు విడతలుగా రూ.7లక్షలు మాత్రమే ఇస్తామని ఏజెన్సీ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రతినిధులు ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం కళాశాలలో ఏవోకు, జూనియర్ అసిస్టెంట్‌కు ఏజెన్సీ ప్రతినిధులు రూ.3లక్షలు ముట్టచెబుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఇదిలా ఉండగా 19 కేటగిరీలలో 155 అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి 3వ నోటిఫికేషన్ ఇటీవలే జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం విడుదల చేసింది. ఈ భర్తీ ప్రక్రియ ఏజెన్సీ వారే చేపట్టాలని స్థానిక అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురాగా భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది.

ప్రిన్సిపాల్ మౌనం

కొత్తగూడెం మెడికల్ కళాశాలలో ఏసీబీ ఉదంతంపై ప్రిన్సిపాల్ మౌనం వహించినట్లు తెలుస్తోంది. కళాశాలలో సుప్రీంగా ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారు. ఆయన కిందిస్థాయి ఉద్యోగులైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో), జూనియర్ అసిస్టెంట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీత భత్యాల బిల్లులు చేయడానికి రూ.15లక్షల లంచాన్ని డిమాండ్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బిల్లుల మంజూరులో ఎవరు తుది నిర్ణయం తీసుకుంటారని, అధికారికంగా మంజూరు ఎవరు చేస్తారని పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ సమయంలో అభ్యర్థుల ఎంపిక... జిల్లా కలెక్టరేట్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లేదా కేటాయించిన ప్రతినిధి సమక్షంలో జరుగుతుంది. కొత్తగూడెం వైద్య కళాశాలలో మొత్తం 49 మందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎంపిక చేయగా, ఆ తర్వాత వీరిలో 23 మంది విషయంలో లోపాలు బయటపడ్డాయంటున్నారు. మరి ఎంపిక ప్రక్రియ సమయంలో అధికారులు ఈ లోపాలను ఎందుకు గుర్తించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సమగ్ర ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు

- 6 నుంచి జిల్లా వ్యాప్తంగా షురూ
- ప్రతి 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్
- పది బ్లాకులకు ఒక సూపర్‌వైజర్
- జిల్లా వ్యాప్తంగా 4.50లక్షల వరకు ఇళ్లు
- నగరం పరిధిలో 88 వేల నివాసాలు


బృందాల ఏర్పాటుకు ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

ఖమ్మం/ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 6నుంచి ప్రారంభించబోతున్న సమగ్ర ఇంటింటి సర్వేకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతుంది. క్షేత్రస్థాయిలో సర్వేకోసం అవసరమైన సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నారు.ప్రతి 150 ఇళ్లకు ఒక బ్లాక్‌గా భావించి ఎన్యూమరేటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పది బ్లాకులకు గెజిటెడ్‌స్థాయి అధికారిని సూపర్‌వైజర్‌గా నియమించబోతున్నారు. ఇందుకు సంబంధించి సర్వేలు సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 4.50లక్షల వరకు ఇళ్లు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలను సర్వేలో వివరాలు పొందుపరుస్తారు. 84 అంశాలతో కుటుంబాల వివరాలు , కులసమాచారం, ఆర్థికస్థితిగతులు, వాహనాలు, ఇతర వివరాలను ఈసర్వేలో రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా మండలస్థాయిలో మండల అధికారులు సర్వే పర్యవేక్షణచేయనుండగా నియజోకవర్గానికిప్రత్యేక అధికారులను నియమించారు జిల్లాస్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు సర్వేను పర్యవేక్షించనున్నారు ప్రతిరోజు ఎన్యూమరేటర్ సర్వే నిర్వహించి 150 ఇళ్లకు సంబంధించిన సర్వేఫారాలను మండల అధికారులకు అందించాలి. మండల అధికారులు కంప్యూటరీకరణ ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి సమాచారం అందించనున్నారు. జిల్లాలో 3400 మందికి వరకు ఎన్యుమరేటర్లను 360మంది సూపర్‌వైజర్లను ఈసర్వేకు నియమించారు. ఈసర్వేద్వారా కులాల వివరాలు కూడా పూర్తిస్తాయిలో తేల్చనున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మునిసిపాలిటీలు, మండలాల్లో ఇంటింటి సర్వే పకడ్బందీగా జరగబోతుంది.

నగరంలో 2,64,310 కుటుంబాలు

ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో సమగ్ర ఇంటింటి సర్వేకు అడుగులు పడ్తున్నాయి. మంగళవారం 24 బృందాలకు శిక్షణ పూర్తి చేసిన అధికారులు బుధవారం తర్వాత కార్యచరణ ప్రారంభించారు. నగరంలో 60 డివిజన్ల పరిధిలో మొత్తం 88వేల నివాసాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా నివాసాల్లో 2,64,310 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు అంచనాలు వేశారు. నగర వ్యాప్తంగా 965 (మిగతా 6వ పేజీలో)

బ్యాంక్ గ్యారంటీ

తప్పనిసరి

- తాలు పేరుతో కోతలు పెట్టొద్దు
- మిల్లర్ల వద్ద ఉన్న గన్నీ బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు అందించాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ధాన్యం కేటాయింపుపై రైస్‌మిల్లర్లతో సమీక్ష

6


రైసుమిల్లుల యజమాన్యాలు, అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్

ఉద్యోగం తిరిగి ఇప్పిస్తానని డబ్బులు వసూలు

సీడీపీవోపై మాజీ అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు

గుండాల, అక్టోబరు 30: ఆమె ఓ అంగన్‌వాడీ టీచర్.. అనారోగ్య కారణాలతో రెండేళ్ల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసింది.. అయితే అధికారిక రికార్డుల్లో ఆమె పేరు తొలగించలేదు. ఈ క్రమంలో తిరిగి విధుల్లోకి చేరేందుకు ప్రయత్నించగా, ఓ సీడీపీవో అవకాశంగా తీసుకొని రూ.లక్షా 50వేలు డిమాండ్ చేసింది. డబ్బులు చెల్లించినా పని కాకపోవడంతో బాధితురాలు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.

గుండాల మండలంలోని కోనవారిగూడెంలో ధనలక్ష్మి అనే మహిళ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా చేసేది. రెండేళ్ల క్రితం అనారోగ్యం, అనివార్య కారణాలతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి విధులకు దూరంగా ఉంది. అయితే సీడీపీవో ఒకరు... ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడంతో ధనలక్ష్మి రాజీనామా చేసింది. కాగా ఇటీవల ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసింది. అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో తన పేరు తొలగించలేదని తెలుసుకొన్న ధనలక్ష్మి ఉన్నతాధికారులను సంప్రదించింది. ఇదే అదనుగా భావించిన సీడీపీవో తాను తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని ఆశచూపడంతో ధనలక్ష్మి గత డిసెంబరులో ఆ అధికారికి రూ.లక్షా 50వేలు లంచంగా ఇచ్చింది. నెలలు గడుస్తున్నా.. ఉద్యోగం రాకపోవడంతో ఆమె ప్రజావాణిలో వినతిపత్రం అందజేసింది. దీంతో సదరు సీడీపీవో రెండు దఫాలుగా ధనలక్ష్మికి రూ.50 వేల చొప్పున ఫోన్‌పే ద్వారా చెల్లింపులు జరిపింది. కాగా బుధవారం మండల పర్యటనకు వచ్చిన జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా ముందు బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది.

ఈ విషయమై స్వర్ణలత లెనీనాను వివరణ కోరగా, మాజీ అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి నుంచి డబ్బులు తీసుకున్న విషయం, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడం తదితర విషయాలు తన దృష్టికి వచ్చాయని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు వివరిస్తానని చెప్పారు.

ఎన్నో అనుమానాలు...

ఇదిలావుండగా, కోనవారిగూడెం అంగన్‌వాడీ సెంటర్‌ను గుండాల 2 కేంద్రం ఇన్‌చార్జిగా రెండేళ్ల నుంచి కొనసాగిస్తున్నారు. కానీ రెండేళ్లగా కూరగాయల బిల్లులు ధనలక్ష్మి ఖాతాలో జమ అవుతున్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో ఆమె పేరు తొలగించలేదు. రెండేళ్ల క్రితం రాజీనామా చేసిన కోనవారిగూడెం సెంటర్ పోస్టు ఖాళీ చూపించకుండా బిల్లులు వేయడం, జిల్లా అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉంది.

ట్రాక్ దాటుతుండగా...

- నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని తండ్రి, కూతురు మృతి
- మధిర రైల్వే స్టేషన్‌లో ఘటన
- పండుగ పూట ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు

6


నూకారపు సరిత

సమగ్ర ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించారు. ప్రతి 175 నివాసాలకు ఒక ఎన్యూమరేటర్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే 25 మంది బిల్ కలెక్టర్లు, 165 మంది మేప్మా రిసోర్స్ పర్సన్‌లు, 200 మంది ఆశ కార్యకర్తలను బృందాలుగా ఏర్పాటు చేసేందుకు ఆన్‌లైన్ ఎంట్రీలను ప్రారంబించారు. బిల్ కలెక్టర్లు సర్వేకు సూపర్‌వైజర్లుగా వ్యవహరించనున్నారు. అయితే బృందాలకు ఇంకా సిబ్బంది కావాల్సి ఉంది. ఈ మేరకు కలెక్టర్‌కు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య సమాచారం అందించారు. ఇతర శాఖల నుంచి ఉద్యోగులను కేటాయింపు జరిపితే కేఎంసీలో సమగ్ర సర్వేకు పూర్తిస్థాయిలో బృందాలు ఏర్పాటు జరుగుతాయి. బృందాలు ఏర్పాటు సందర్భంగా కేఎంసీ కార్యాలయంలో కంప్యూటర్‌ల వద్ద సందడి నెలకొంది.

ఒక్కో ఇంటి సర్వేకు గంట

ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర ఇంటింటి సర్వే నమూన పత్రాలు కేఎంసీ కార్యాలయానికి చేరాయి. నవంబరు 6 నుంచి సర్వే ప్రారంబం జరిగే సూచనలు వెలువడుతున్నాయి. మొత్తం 84 అంశాలతో కూడిన విధంగా ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కులాల వారీగా సర్వే అంశాలను నమోదు చేశారు. ఇళ్లలో పెంచుకొనే కోళ్ల (కొడి, పిల్లలు) నుంచి కార్ల వరకు స్థిర, చర ఆస్తుల వివరాలను నమోదు చేయాలని సర్వే నమోనాలో ప్రభుత్వం పేర్కొంది.

బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

- ధాన్యం కేటాయింపుపై రైస్‌మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కేటాయింపు చేయాలంటే బ్యాంకు గ్యారంటీ, లేకుంటే సెక్యూరిటీ డిపాజిట్‌ను మిల్లర్లు చూపించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారంటీపై మిలర్లు, బ్యాంక్ అధికారులతో కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అన్నారు. పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా రైస్ మిల్లులకు బ్యాంకు గ్యారంటీ ఆధారంగా కేటాయించేనున్నట్లు ప్రభుత్వం పాలసీ నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు, మిల్లింగ్ సామర్థ్యంపై 10 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్, గతంలో బకాయిలు ఉండి సకాలంలో పెనాల్టీతో సహా చెల్లించిన మిల్లర్లు 20 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్, వంద శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీతో డిఫాల్ట్ ఉన్న మిల్లర్లు 25 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

రైస్ మిల్లులకు ధాన్యం మొత్తం కేటాయింపుల ప్రకారం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరిగా తీసుకోనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేయకుండా కొనుగోలు చేయవద్దని ఆదేశాలు జారీ చేశామని, మిల్లుల వద్ద తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించవద్దని కలెక్టర్ తెలిపారు. మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యానికి కూడా కోతలు పెడితే ఆయా మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి గోడౌన్ స్థలం ఉందని, ముందుగా ఖమ్మం జిల్లా గోదాముల్లో, ఎఫ్‌సీఐకు అలాట్మెంట్ జరిగేలా చూడాలన్నారు. మిల్లుల వద్ద ఉన్న గన్ని బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు అందించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలకు దగ్గర్లోని రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ చేయాలని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎప్పుడు, ఎంత వస్తుందో ప్రణాళిక తయారు చేసుకొని దాని ప్రకారం సన్నద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, మిల్లర్లు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు మండలాల బీఆర్ఎస్ కమిటీలు రద్దు

భద్రాచలం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన బీఆర్ఎస్ మండల కమిటీతో పాటు ఇతర కమిటీలను రద్దు చేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మూడు మండలాలలోని పార్టీకి చెందిన అన్ని కమిటీలను కేంద్ర పార్టీ ఆదేశాలతో రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబరు 4న నూతన కమిటీలను మూడు మండలాలకు నాయకుల సమన్వయంతో ఏకగ్రీవంగా ప్రకటిస్తామని తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీల నిర్మాణం చేపట్టి పునర్వైభవం తీసుకువస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామన్నారు.

తప్పిన విద్యుత్ చార్జీల భారం

- ఇది బీఆర్ఎస్ పోరాట ఫలితమే
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పోరాటం వల్లనే విద్యుత్ చార్జీలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కిదగ్గిందని, దీనివల్ల ప్రజలకు రూ.18500 కోట్ల భారం తగ్గిందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మధుసూదన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు పరిచేవరకు వెంట బడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయక పోగా, విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం బీఆర్ఎస్ పోరాటం, ప్రజల వ్యతిరేకత వల్ల వెనక్కి తగ్గిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, ఉచిత విద్యుత్ అర్హులకు ఇవ్వలేదని, కోతలు మాత్రం విధిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.18,500 కోట్ల అదనపు విద్యుత్‌భారంను ఎలక్ట్రిసిటీ బోర్డు తిరస్కరించటం బీఆర్ఎస్ విజయమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రచారానికే ప్రారంభిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధాన్యం రావటానికి ముందే పక్కా ప్రణాళికలు ఉండేవని, ఇప్పుడు బస్తాలు, మిల్లర్లులను సమన్వయం చేసుకోలేదన్నారు. సన్నబియ్యం విషయంలో అనేక నిబంధనలను పెడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇళ్లు అర్హులందరికీ ఇవ్వాలని సండ్ర డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని తండ్రి, కూతురు మృతి

- పండుగ పూట ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు

మధిర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తండ్రిని వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి వస్తుండగా రైలు రూపంలో తండ్రి, కూతురిని మృత్యువు కబళించి పండుగ పూట ఆ కుటుంబంలో విషాదం నింపిన సంఘటన మధిరలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వారితోపాటే వున్న మనవడు ప్రమాదంనుంచి సురక్షితంగా తప్పించుకున్నాడు. మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంగర కేశవరావు (65)కు అనారోగ్యంగా ఉండటంతో ఆయన కుమార్తె మధిర మండలం ఖమ్మంపాడుకు చెందిన నూకారపు సరిత(46), ఆమె కుమారుడు కౌశిక్‌తో కలిసి తండ్రికి వైద్యంకోసం బుధవారం ఉదయం విజయవాడలోని ఆసుపత్రికి తీసుకెళ్లాడు.

ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేసుకొని సాయంత్రం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో మధిర వచ్చి రెండో నెంబర్ ప్లాట్ ఫారంలో దిగారు. తండ్రి కేశవరావును ఆటో ఎక్కించి మల్లారం పంపేందుకు టుటౌన్‌కు వెళ్లేందుకు ఒకటవ నెంబర్ ప్లాట్ పారం వైపు పట్టాలు దాటుతున్న క్రమంలో చైన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని తండ్రి, కూతురు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

మనవడు కౌశిక్ రెప్పపాటులో తప్పించుకున్నాడు. ఈ వార్తతో పండుగపూట ఇరువురు కుటుంబాల్లో, మల్లారం, ఖమ్మంపాడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- చాంపియన్‌గా నిలిచిన పురుషుల జట్టు రంగారెడ్డి
- మహిళల జట్టు విజేత నల్గొండ
- క్రీడలను ప్రోత్సహించాలి: ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఉత్కంఠ భరితంగా జరిగిన పురుషుల మహబూబ్‌నగర్ - రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన పురుషుల కబడ్డీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి విజేతగా నిలిచింది. మహిళ జట్ల మధ్య జరిగిన మరో ఫైనల్ మ్యాచ్ రంగారెడ్డి - నల్గొండ జట్లు తలపడగా నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. గత మూడు రోజులుగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా పీఎస్ఆర్ ట్రస్ట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మూడో రోజు నిర్వహించగా బుధవారం ముగిసాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో సింథటిక్ మ్యాట్‌పై హోరాహోరీగా జరిగిన లీగ్ అండ్ నాకౌట్ సూపర్ లీగ్ మ్యాచ్‌లు దాటుకొని సెమీస్ ఫైనల్ నిర్వహించి తొలి స్థానంలో నిలిచిన జట్లకు, మిగతా స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ ముగింపు వేడుకల్లో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేసి మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించాలని వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసానికి ఉత్తేజానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, కొత్వాల శ్రీనివాస్‌రావు, నాగ సీతారాములు, కోనేరు సత్యనారాయణ(చిన్ని) పాల్గొన్నారు.

భద్రాద్రిలో కార్తీకమాస పూజలు, సేవలు ఇవే

భద్రాచలం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉప ఆలయమైన శ్రీ అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, సేవలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి వివరాలను వెల్లడించారు. 4వ తేదీన స్వామి వారికి భస్మాభిషేకం, జ్యోతిర్లింగార్చన, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, నీరాజన మంత్ర పుష్పం ప్రసాద వితరణ చేయనున్నారు. 11న శివాలయంలో చందనోత్సవం(చందనాలంకారం), పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నారు.

15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రుద్రాభిషేకం పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం పురాణ ప్రవచ నం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నారు. 17న స్వామి వారి కల్యాణం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 18న పుష్పోత్సవం(ప్రత్యేక పుష్పాలంకరణ), మహా నివేదన, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నారు. 25న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నారు. 27న నదీహారతులు పవిత్ర గోదావరీ నదీ తీరంలో సమర్పించనున్నారు.

ఆస్పత్రుల తీరుపట్ల
కలెక్టర్ ఆగ్రహం

- తీరుమార్చుకోకుంటే చర్యలు తప్పవు
- వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు.సివిల్ ఇన్ ఫ్రా, వైద్య శాఖ సిబ్బంది హాజరు నమోదు, వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ నియామకాల ప్రక్రియ, డ్రగ్స్ (మందుల) నిల్వల సద్వినియోగం, ఆసుపత్రుల నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ప్రవర్తన, స్పందించే విధానం చాలా దారుణంగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మనం ప్రజలకు సేవ చేయడం కోసం ఉన్నామనే స్పృహ లేకపోతే పని చేయవద్దని హెచ్చరించారు. పేషెంట్లతో మర్యాదగా ప్రవర్తించడం,సేవా దృక్పథంతో పని చేయడం వైద్య శాఖలో చాలా అవసరమని, ఇది లేకుండా ఎంత మౌళిక వసతులు కల్పించినా ప్రజలలో విశ్వాసం కల్పించలేమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అనుమతి లేకుండా తీసుకున్న సెలవులకు జీతం కట్ చేయాలని అయినప్పటికీ పద్దతి మార్చుకోకపోతే మెడికల్ కౌన్సిల్‌కు పిర్యాదుచేయనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తామాలజిస్ట్, డెంటిస్ట్, పిడియాట్రీషియన్, ఈ.ఎన్.టి, గైనిక్, డర్మటాలజీ విభాగాలలో వైద్యుల పనితీరు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కడా మందుల కొరత ఉండటానికి వీల్లేదని అన్నారు. ఆసుపత్రులలో వైద్యుల రూమ్ వద్ద ఆ డాక్టర్ రౌండ్ లకు ఎప్పుడు వెళ్తారో టైమింగ్ రాసి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఆసుపత్రి దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, దీనికి ఆరోగ్య మిత్ర సేవలు వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాజేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుబ్బారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కె. రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవ చేస్తాం..

- మెడికల్ కళాశాలలో 'తెల్లకోటు' వేడుకలు
- అనాటమీ విభాగంతో డిసెక్షన్ ప్రతిజ్ఞ



అనాటమీ విభాగంలో డిసెక్షన్ ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ విద్యార్థులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యులుగా అంకితభావంతో నిరుపేదలకు సేవలు అందిస్తామంటూ మెడికల్ వైద్య విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 'తెల్లకోటు' ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100మంది విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెల్లకోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ విద్యార్థులు తమ వైద్య విద్యలో మెళకువలు నేర్చుకుని భవిష్యత్తులో వైద్యులుగా మెరుగైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. అనంతరం కడవెరిక్ ప్రమాణం చేశారు. సైన్సు వైద్యరంగాల అభివృద్ధికి విద్యార్థుల విజ్ఞానం కోసం శరీరాన్ని దానం చేసిన ఈ వ్యక్తికి, వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు మేము ఎప్పటికీ కృతజ్ఞతగా రుణపడి ఉంటామని ఈ శవం ఎప్పుడూ మన గురువుగా ఉంటూ సమాజానికి సేవ చేయడంలో అభివృద్ధి చేయడంలో మాకు సహాయం చేస్తుందని, మానవులందరికీ మేము కృతజ్ఞతగా ఉంటామంటూ వైద్య విద్యార్థులు శవానికి గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిభాయి, అనాటమీ హెచ్‌వోడీ చండీప్రియ, వైస్ ప్రిన్సిపాల్స్ సరిత, డాక్టర్ సృజన, హెచ్‌వోడీలు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సమతరాణి, డాక్టర్ రాథోడ్ వినాయక్, డాక్టర్ జె.తులసి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వన సమారాధనను విజయవంతం చేయాలి

- జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు



ఉద్యోగుల వన సమారాధనకు సన్నాహాలను పరిశీలిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3న జరిగే ఉద్యోగుల సమ్మేళనం, వనసమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కోరారు. బుధవారం చెరుకూరి వారి మామిడితోటను టీఎన్జీవో నాయకులు ఉద్యోగసంఘాల నాయకులతో సందర్శించారు. సకల ఉద్యోగుల కోసం పెద్దఎత్తున వనసమారాధన నిర్వహిస్తోన్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా తోటలో ప్రధాన వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు మరో వేదిక ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉద్యోగ క్రీడాకారుల కోసం, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు మైదానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కేడర్ల ఉద్యోగులు కుటుంబాలతో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీఎన్జీవో నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, జయపాల్, కొమరగిరి దుర్గాప్రసాద్, గంగవరపు బాలకృష్ణ, ఎర్రా రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, సగ్గుర్తి ప్రకాశరావు, ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోల అధికారులతో బుధవారం నగరంలోని ప్రాంతీయ మేనేజరు కార్యాలయంలో బస్సుల ఏర్పాట్లపై ఆర్ఎం సరిరాం ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఆంధ్రప్రదేశ్‌లోని పంచరామాలు, అరుణాచలం, శబరిమల, అన్నవరం క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఈ సమావేశంలో చర్చించారు. పంచరామాలకు నవంబరు 3 నుంచి 10వరకు, 17 నుంచి 24 వరకు ప్రతి ఆదివారం ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో బస్సులు అందుబాటులో ఉంటాయని యన తెలిపారు. అన్నవరానికి నవంబరు 3 నుంచి 10వ తేదీవరకు, 14న కార్తీక పౌర్ణమిన, 17 నుంచి 24 వరకు రీజియన్ పరిధిలో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. అరుణాచలానికి నవంబరు 13న రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి బస్సులు బయలుదేరి తిరిగి 16న ఆయా డిపోలకు చేరుకుంటాయని తెలిపారు. గిరిప్రదర్శనకు ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. శబరిమలకు అద్దె ప్రతిపాదికన రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. ఈ బస్సులో ఇద్దరు స్వాములకు (గురు స్వామి, మణికంఠ స్వామి)ఇద్దరు వంటమనుషులు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తికి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు తెలిపారు. భక్తులు మరిన్ని వివరాలకు మీమీ పరిధిలోని ఆర్టీసీ డిపోలలో సంప్రదించాలని తెలిపారు. 30 నుంచి 40మంది భక్తులు ఉంటే అగిడిన తేదీల్లో బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.




ఖమ్మం పట్టణ మరియు ఉమ్మడి జిల్లా ప్రజలకు,,,
కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు దీపావళి శుభాకాంక్షలు...
ABN ఆంధ్రజ్యోతికి వార్షికోత్సవ శుభాకాంక్షలు



అభివృద్ధి గుమ్మం - మన ఖమ్మం

లివింగ్ సిటీగా ఖమ్మం



నాడు మనిసిపాలిటీ నుంచి ఖమ్మం కార్పొరేషన్‌గా మార్పు...
ఖమ్మం 4 రోడ్ల లైన్ల విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్స్‌తో
సుందరీకరణ, కోట్లాది రూపాయలతో ఖమ్మం కార్పొరేషన్
అభివృద్ధి, ఖమ్మం నగరానికి కొత్త అందాలు...
సీతారామా తో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం...
జిల్లాకు నలుమూలాల జాతీయ రహదారుల అనుసంధానం ...
ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ఖమ్మం నగరాన్ని
ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు
నడిపిస్తూ, రైతు రుణమాఫీతో రైతు కుటుంబాలకు
నిజమైన దీపావళి వెలుగు నింపిన ఘనత
రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు
గౌ॥ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారిది ...
ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రాన్ని
దేశానికి మోడల్‌గా తీర్చి దిద్దేందుకు
మలేషియాలో పర్యటించి
అధ్యయనం చేసి వచ్చిన రైతు బాంధవుడు
వ్యవసాయ శాఖామంత్రి
గౌ. శ్రీ. తుమ్మల నాగేశ్వరరావు గారికి
ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరపున
ఇవే మా హృదయపూర్వక దీపావళి
శుభాకాంక్షలు

గౌ॥ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు
తెలంగాణా రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు



గౌ॥ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు
తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు



శ్రీమతి పునుకొల్లు నీరజ గారు
మేయర్ ఖమ్మం కార్పొరేషన్



శ్రీ తుమ్మల యుగంధర్ గారు
ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

చిరు దివ్వెల దీపావళి నేడు

జోరుగా బాణసంచా విక్రయాలు.. బొమ్మల కొనుగోళ్లు

కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగతిని జాగృతంచేసే చైతన్యదీప్తుల శోభావళి దీపావళి. ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపపు కాంతుల వేడుక. మనలోని అజ్ఞానాన్ని, అహంకారాన్ని కష్టనష్టాలను తొలగించేందుకు వ్యక్తిత్వమే దివ్వెలుగా వెలగాలని చిన్న దీపం ఎంతటి చీకటినైన పారద్రోలుతుందని చేప్పే సారాంశమే దీపావళి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ. రెండురోజుల పాటు జరుపుకునే ఈ పండుగకు గృహాలను శుభ్రపర్చుకుని, తోరణాలతో అలంకరించుని సాయంత్రం చీకటీ వేళ బాణాసంచా కాల్చి వేడుకచేసుకుంటారు. దీపం ఉన్న చోట జ్ఞానసంపద ఉంటుందని నమ్మకంతో దీపం సాక్షాత్తు లక్ష్మీదేవికి ప్రతీరూపంగా భావించి దీపావళి రోజున తలంటు స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించి, బొమ్మల కొలువులు ఏర్పాటుచేసి అందులో లక్ష్మీదేవి ప్రతిమలను ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. పంచదార చిలుకలు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించి ఉత్సాహంగా సంబరాలు జరుపుకుంటారు.

టపాసుతో కారాదు అబాసు...

కాంతులు నింపే ఈ పండుగ వెలుగుల మాటున ఆనందంతోపాటు అదమరిస్తే ప్రమాదం కూడా పొంచి ఉంది. కాంతులతో కళ్లకు కలిగే నష్టాన్ని పట్టించుకోవాలి. మతాబులు, బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దల సంరక్షణలో జరుపుకోవాలని, చిన్న పిల్లలకు వారి స్థాయిని బట్టి మతాబులు కాల్చేలా చూడాలి.


బాణాసంచా విక్రయాలు

కళకళలాడుతున్న మార్కెట్లు...

పంచదార చిలుకలు, ప్రమిదలు, పూజాసామాగ్రి, కొత్తబట్టలు కొనుగోలుతో కొత్తగూడెంలోని మార్కెట్లో దీపావళి కళ కన్పించింది. విభిన్నరూపాలల్లో లక్ష్మీదేవి ప్రతిమలు, మరమరాలు, రంగురంగుల డిజైన్‌లతో ప్రమిదలను విక్రయదారులు ప్రదర్శించిన వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. పూలు, పూజా సామాగ్రితో మార్కెట్లు కళకళ లాడుతున్నాయి.

సాచివేత ధోరణి సహించేది లేదు


మాట్లాడుతున్న డి.వెంకటేశ్వరరావు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పాలకప్రభుత్వాలు సాచివేత ధోరణి ప్రదర్శిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయని.. సమస్యలు పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు(డీవీ) అన్నారు. బుధవారం పీఆర్‌టీయు కార్యాలయంలో 23మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ప్రతి మం డలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ సంఘ జి ల్లా అధ్యక్షుడికి ఏకరువు పెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరువల్ల చాలా మంది ఉ పాధ్యాయులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పాలకప్రభుత్వాలు సాచివేత దోరణి ప్రదర్శి స్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయన్నారు. ఏ ఒక్క ఉ పాధ్యాయ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆంధోళన వెల్లిబుచ్చా రు. ఉపాధ్యాయ ఉదోగులకు రావాల్సిన 5 డీఏలలో కేవలం ఒకటి మాత్రమే ప్రకటించారని, తక్షణం పెండింగ్ డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమని, ఆ దిశగా ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వై.సంగమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవి, వెంకటేశ్వర రెడ్డి, పూర్ణ, బి. కిషన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జహంగీర్ షరీఫ్, 23మండలాలకు చెం దిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పులుసు బొంతకు నిధులు మంజూరు చేయండి

సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే పాయం


రేవంత్‌రెడ్డితో పాయం

మణుగూరు, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పులుసు బొంత ప్రాజెక్టు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో సీఎంను కలుసుకుని నియోజకవర్గ రైతులకు అత్యంత ప్రాధాన్యత గల లిఫ్ట ఇరిగేషన్లు, గ్రావెటీ కెనాల్ ఏర్పాటు చేస్తే రైతులు సాగు నీటి కష్టాలు తీరుతాయని తెలిపానన్నారు. ప్రధానంగా పినపాక నియోజకవర్గంలోని పులుసుబొంత ప్రాజెక్టు, గ్రావెటీ కెనాల్స్, మణుగూరు మండలంలోని రేగుల గండి, పేరంటాల చెరువు మారెడు పాలెం లిఫ్ట, గ్రావెటీ కెనాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. స్థానిక రైతాంగం ఎదురుకుంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. అలాగే నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి భద్రాచలం రాముల వారి ప్రసాదాన్ని అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపానన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

కొత్తగూడెం, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాల అనుబంధంగా కేంద్ర జీజీహెచ్ఎస్, ఎంసీహెచ్ లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భర్తీల్లో దరఖాస్తు చేసుకున్న ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కూడ మెడిల్ కళాశాలలో జరిగిన అవినీతి ఆరోపణలు ఎదర్కొని సస్పెండ్ చేసిన విషయం అందరు మర్చిపోకముందే మళ్లీ వైద్య కళాశాల సంబంధించిన అధికారులు అవినీతి ప్రత్యక్షంగా పట్టుబడటం కనిపిస్తోందన్నారు. ఇంత అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్య వ్యవస్థపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఏజెన్సీ కమిటీలను రద్దు చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుచేసి ఆ పోస్టులు భర్తీ చేయాలని, జిల్లాస్థాయిలో జరిగిన ఈ అవినీతి కార్యక్రమాలకు కలెక్టర్ కూడ బాధ్యత వహించి క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలి

ఇల్లెందు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బయ్య అభిమన్యు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ రవికి బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్ల స్కా లర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్లు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బానోత్ కిషన్, సాగర్, నవీన్, సుధీర్, రఘు, రవిచరణ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్ల కార్డులతో న్యాయవాదుల నిరసన

కొత్తగూడెం లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా న్యాయస్థానాల్లో పోలీసులు, అర్థసైనిక బలగాలు ప్రవేశించి న్యాయవాదులపై విచక్షణరహితంగా దాడిచేసి గాయపర్చి లాఠీచార్జీ చేయడాన్ని నిరసనగా బుధవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయాదులపై పోలీసులు విచక్షణ రహితంగా జరిపిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, కార్యవర్గసభ్యులు దూదిపాల రవికుమార్, ఎస్‌కే.సాదీక్‌పాషా, భాగం మాధవరావు, ఎస్.ప్రవీణ్‌కుమార్, నల్లమల ప్రతిభ, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యులు సమయం పాటించాలి

పాల్వంచ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ కోరారు. బుధవారం పట్టణ పరిధి శేఖరం బంజర యూపీహెచ్‌సీని ఆకస్మీకంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో శానిటేషన్ నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తం చేసి సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు, డ్రెస్‌కోడ్, తప్పక పాటించాలని సూచించారు.

డిగ్రీ కళాశాల ప్రగతికి పాటు పడదాం

భద్రాచలం, అక్టోబరు 30: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి కళాశాల ప్రగతికి పాటుపడదామని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భ ద్రాచలంలోని డిగ్రీ, పిజి కళాశాలలో బుదవారం ఐటిసి నోట్ పుస్తకాల పంపిణీ, ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి, లైబ్రరీ, ప్రయోగశాల పరీక్షల స్ట్రాంగ్ రూం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అన్నదానం మహాదానం

» అయ్యప్ప మాలదారణ స్వాములకు శ్రీధర్మ శాస్త్ర అన్నదానం ప్రారంభించిన మేయర్



అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న నగర మేయర్ నీరజ

ఖమ్మం సాంస్కృతికం/ ఖమ్మం సంక్షేమ విభాగం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటైన అయ్యప్ప స్వామి అన్నదాన మందిరాన్ని నగర మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం ప్రారంభించారు. స్థానిక 10వ డివిజన్‌లోని చైతన్య నగర్‌లో శ్రీ ధర్మశాస్త్ర అన్నదాన సేవాసమితి ఏర్పాటు చేసిన ఈ మందిరాన్ని మేయర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి ధర్మశాస్త్ర దేవాలయానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో హరిప్రసాద్ నంబూద్రి స్వామి, ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు, కార్యదర్శి అట్లూరి మధు, ఉపాధ్యక్షుడు పొన్నం వీరవసంతకుమార్, కోశాధికారి టి. పుల్లంరాజు, స్థానిక కార్పొరేటర్ సరిపుడి సతీష్, సరిపుడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సెట్‌కం కార్యాలయంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నూతన బ్యాచ్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, రిఫ్రిజేటర్ ఏసీ మెకానిజం తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌కు చెందిన సెట్విన్ సంస్థ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వనుందని ఆయన తెలిపారు. నవంబరు 1 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఇవ్వడానికి, ఇతర సమాచారం కోసం సర్ధార్ పటేల్ స్టేడియంలోని సెట్‌కం కార్యాలయంలో నేరుగా, 9948207271ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయండి

అధికారులకు రైతుల వినతి



నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. అభివృద్ధి పేరుతో భూములు తీసుకుంటున్నా రైతులకు మాత్రం న్యాయం చేయాలని దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూనిర్వాసితులు అధికారులను వేడుకున్నారు. బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూ నిర్వాసితులు కలిశారు. రైతులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు ఈ సమావేశంలో భూ నిర్వాసిత రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా భూ నిర్వాసితులకు ప్రస్తుతం ఇస్తున్న పరిహారం సరిపోదని దీనిని పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతులకు గ్రామీణ ప్రాంతాలను కనెక్టివిటీ చేస్తూ సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్ హైవే అధికారులు కూడా రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కొదుమూరు నుంచి అల్లిపురం మధ్యలో రాఘవాపురం డొంక వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్ నాలుగు వరసల రహదారికి అనుకూలంగా వెడల్పు పెంచాలని రైతులు కోరారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాది కాసరా రాజశేఖర్ రెడ్డి దెబ్బల వెంగళరావు మేడా గోపాలకృష్ణ బాల నరసింహారావు, దొబ్బల నరసింహారావు, గాంధీ మురళి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

» విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

» బీఆర్ఎస్ విధానాలే అవలంభిస్తున్న కాంగ్రెస్

» ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్&బీ గెస్ట్‌హౌస్ వద్ద ఫీజుల దీక్ష

ఖమ్మంటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణం విడుదల చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో నగరంలోని ఆర్&బీ గెస్ట్‌హౌజ్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ఫీజుల దీక్షను ఆయన ప్రారంభించారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. గత బీఆర్ఎస్ ఫీజుల బకాయిలను విడుదల చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధానాన్ని అవంభిస్తున్నదని ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిల కోసం ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు తక్షణం స్పందించి విద్యారంగానికి ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకుంటే ముగ్గురు మంత్రులను అడ్డుకుంటామన్నారు.

ఎస్ఎఫ్ ఫీజు దీక్షలకు ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్. రమేష్ తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడ సుధాకర్, ఉపాధ్యక్షుడు సాయిశేషు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన స్పెషల్ ఎడ్యుకేషన్ ధృవపత్రాలు పరిశీలన

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డైట్ కళాశాలలో మంగళ, బుధవారాలలో నిర్వహించిన స్పెషల్ ఎడ్యుకేషన్ ధృవపత్రాలు పరిశీలన ముగిసిందని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. మొత్తం స్కూల్ అసిస్టెంట్స్ 21 మందికి 19 మంది హజరు కాగా ఇద్దరు హజరుకాలేదని తెలిపారు. ఎస్‌జీటీలు మొత్తం 67 మందికి 48 మంది హజరు కాగా, 19 ధృవపత్రాల పరిశీలను హజరుకాలేదని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఎంవో రాజశేఖర్, సూరింటెండెట్ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధృవపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వమే పత్తిని కొనుగోలు చేయాలి

» ఏఐపీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అచ్చయ్య



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అచ్చయ్య

బరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తి పంట ను బేషరుతుగా నూరుశాతం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పత్తికి ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వాలని లేని పక్షంలో నవంబరు 4న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టేందుకు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) పిలుపుఇచ్చిందని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అచ్చయ్య తెలిపారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో రైతుల సమస్యలపై మాట్లాడారు. పత్తి రైతులు ప్రతిసారి ధగా పడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు పత్తి సాగుకు అనుకూలంగా లేకపోవటంతో దిగుబడి తగ్గిపోయిందని ఇప్పుడు సరైన ధర లేక పోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులు తరలిరావాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కమ్మకోమటి నాగేశ్వరరావు, కోశాధికారి కేలోత్ లక్ష్మణ్; నాయకులు మారుతి మల్లయ్య పాల్గొన్నారు.

నిద్రమత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం

» రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే: రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు ఇప్పుడు నిద్రమత్తులో ఉన్నారని, బీజేపీ రాష్ట్ర నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఎద్దేవ చేశారు. ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ హోటల్‌లో బుధవారం జరిగిన క్రియాశీలక సభ్యత్వ నమోదులో భాగంగా విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ 30 లక్షల సభ్యత్వం కలిగి ఉందన్నారు. బీజేపీ అభివృద్ధి చూసి కాంగ్రెస్ ప్రభు త్వం ఓర్వలేకపోతుందన్నారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒకతాను ముక్కలేనని, బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా రెండు పార్టీలు అడ్డుకునేందు కు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రానున్న రోజు ల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోతుందన్నారు ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు తాండ్ర వినోదరావు, అశోకొరెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, దొంగల సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన రేషన్‌డీలర్లు



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి శ్రీనివాసరెడ్డిని బుధవారం జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలిశారు. ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. ఈసందర్భంగా జిల్లాలో రేషన్ డీలర్ల సమస్యలు, దుకాణాల పరిస్థితిని వివరించారు. ఈకార్యక్రమంలో బానోతు వెంకన్న, షేక్ జానిమియా, దొండ దుర్గయ్య, షేక్ ఇబ్రహీం, మహేష్, బాబు తదితరులున్నారు.

సీసీఐ నిబంధనలతో పత్తి రైతులకు అన్యాయం

» బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రామలింగేశ్వరరావు



సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

తల్లాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలతో అమ్ముకొనేందుకు పత్తిని తెచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకువచ్చిన రైతులు నిబంధనల పేరుతో పత్తిని కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. 12శాతం మించి తేమ ఉందనే కారణంతో పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. ప్రస్తుతం 12శాతం ఉన్న తేమశాతాన్ని 18శాతానికి పెంచి రైతులకు వెసులుబాటు కల్పించాలని రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీసీఐ నిబంధనల వల్ల రైతులు ప్రైవేట్ దళారులకు క్వింటా రూ.7వేల నుంచి రూ.5,500కు విక్రయించుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు దక్కడం లేదని పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, పెరిక కిరణ్, చల్లా నరేష్ పాల్గొన్నారు.

వర్షంతో నిలిచిన వరి కోతలు

» ఆకాశం మేఘావృతంతో అన్నదాతల ఆందోళన



ధాన్యం రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పుతున్న రైతు

కల్లూరు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతం కావడంతో పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి వాన ముబ్బులతో పాటుగా చిరుజల్లులు పడటంతో వానకాల సీజన్‌లో వరి కోతకు సిద్ధంగా ఉన్న పైరును యంత్రాలతో కోయించకుండా నిలిపి వేశారు. ఇప్పటికే మండలంలోని కప్పలబంధం, బత్తులపల్లి, ఎర్రబంజర, కొర్లగూడెం, కల్లూరు, లింగాల, చండ్రుపట్ల, రఘునాథబంజర ఎర్రబోయినపల్లి తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి పైరు కోతలకు సిద్ధంగా ఉంది. ఇక రైతులు కూడా ఈ సీజన్‌లో వాతావరణం అనుకూలించడం లేదని ఆందోళనలో పడ్డారు. ఈ దశలో యంత్రాలతో వరి కోతలు కోయిద్దామని ఎదురు చూపులు చూస్తున్నారు. ఇప్పటికే సాగర్ ఎడమకాల్వ కింద మండలంలో 33,350 ఎకరాల్లో వరి పైరు సాగు చేయగా, దిగుబడికి వచ్చింది. నవంబర్ మాసంతంలో రైతులు యంత్రాలతో వరి కోతలు పూర్తి చేసే పరిస్థితి. అయితే తరచుగా తుఫాన్‌లు ఏర్పడటం, ఆపై వర్షాల కారణంగా పక్వానికి వచ్చిన వరి నేల వాలి నీటిలో తేమతో కుళ్లి పోవడమే కాకా మొలకలు వస్తుందని పలువురు రైతులు దిగాలు పడుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామా ల్లో చేతికి వచ్చిన ధాన్యాన్ని అరబెట్టుకోగా చిరు జల్లులు కురవడంతో తడవకుండ ధాన్యం రాశులపై పట్టా లు కప్పి రక్షించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో దిగుబడి అయిన పంట దక్కడం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు

మధిర, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మధిర మండలం దెందుకూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. దెందుకూపరు గ్రామానికి చెందిన భాజా సాయి(22) ద్వి చక్ర వాహనంపై స్వగ్రామం నుంచి మధిర వెళ్తుండగా, గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వాహనంపై ఉన్న చందు, గోపి అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఆరోకే ఫౌండేషన్ రామకృష్ణ సభ్యులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుడు సాయి సుబాబుల్ కర్రనరికే పనులకు వెళ్తుంటాడని సమాచారం.

బీఆర్ఎస్ వల్లే విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణ

» జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

మధిరటౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ పోరాటం వల్లనే రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. బుధవారం మధిర లోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాలని చూస్తే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించడమే కాక పోరాటాలకు సిద్ధం, అవడంతో ప్రభుత్వం పెంపు ప్రతిపాదనను ఉప సంహరించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు పై శ్రద్ధ పెట్టాలని, బవిష్యత్తులో ప్రజలపై ఎటువంటి భారం వేయదలచిన తాము పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, నాగబాబు, పరిశా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

118 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బుధవారం 118 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎండు గంజాయి అక్రమ రవాణా సమాచారం అందడంతో జిల్లా అధికారి జాన య్య ఆధ్వర్యంలో రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలు భద్రాచలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ సమయంలో రెండు ఆటోలలో ఒడిశా రాష్ట్రంలోని కలిమెల అటవీ ప్రాంతంలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌లో విక్రయించేందుకు నిందితులు ప్రయత్నించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ఆటోలను నిలువరించి తనిఖీ చేయగా 118 కేజీల ఎండు గంజాయి లభ్యమయ్యింది. ఇందులో ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, ఓవ్యక్తి పరారయ్యారని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరం చంద్ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 30 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీలలో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్‌పాషా, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ పాల్గొన్నారు

సమగ్ర ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం: ఆర్డీవో

కల్లూరు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను నవంబరు 6 వ తేదీ నుంచి కల్లూరు డివిజన్ పరిధిలో గల మండలాల్లో నిర్వహించేందుకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు ఆర్డీవో రాజేంద్రగౌడ్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కుంటుంబ సర్వేకు సంబంధించి వివరాలను వెల్లడించారు. డివిజన్ పరిధిలో గల ఆరు మండలాల్లో ఈ సర్వేకు మొత్తం 696 మంది ఎన్యూమారేటర్లను నియమించినట్లు తెలిపారు. కల్లూరు మండలానికి 127, పెనుబల్లి మండలం 123, సత్తుపల్లి రూరల్ 83, వేంసూరు 92, సత్తుపల్లి మునిసిపాలిటీ 83, తల్లాడ 107, ఏన్కూరు 81 ఎన్యూమారేటర్లను నియమించామన్నారు. వారికి గాను ఆయా మండలాల కేంద్రాల్లో గురువారం శిక్షణ పొందిన ఎంపీడీవో, తహసీల్దార్ల పర్యవేక్షణలో సర్వేపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన ఎన్యూమారేటర్లు నవంబరు6 నుంచి 18 వ తేదీ లోగా ఇంటింటి సర్వే చేస్తారని చెప్పారు. 19 నుంచి 27 వ తేదీలోగా సమగ్ర కుటుంబ సర్వే వివరాలు డేటా ఎంట్రి నమోదు చేయడం జరుగుతుందని, 10 నుంచి 15 మంది ఎన్యూమారేటర్లకు సగటున ఒక ఎస్‌వో ఉంటారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వేకు వచ్చిన వారికి కుటుంబ సభ్యులు సహకరించాలని ఆర్డీవో కోరారు.

గుండాలలో దొంగల హల్‌చల్

● రామాలయంలో.. జ్యూయలరీ షాప్‌లో చోరీ

గుండాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. స్థానిక రామాలయంతో పాటు ఓ జ్యూయలరీ దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆటోలో వచ్చిన వ్యక్తులు ముందుగా ప్రధాన రహదారిలోని మణికంఠ జ్యూయలరీ షాపు తలుపులు పగులగొట్టి లోపలి కౌంటర్‌లో ఉన్న వెండి ఆభరణాలను దొంగలించారు. అయితే ముందుగా బయట ఉన్న సీసీ కెమెరాలను పక్కకు తొలగించి ఈ చర్యకు పాల్పడ్డారు. అనంతరం రామాలయంలోకి గోడపై నుంచి దూకి హుండీ తాళం పగులగొట్టారు. బుధవారం తెల్లవారు జామున దుకాణానికి వచ్చిన యజమాని తలుపులు పగులగొట్టి ఉండటం గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం అధికారులు డాగ్‌తో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తలుపులు, తాళాలపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. ఇద్దరు వ్యక్తులు మాస్కులు, చేతులకు గ్లౌజులు వేసుకొని ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజిలను పరిశీలించగా అర్ధరాత్రి ఓ ఆటోలో తిరిగినట్లు తెలుస్తుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజమౌళి తెలిపారు..

ఘనంగా హరిహరాత్మజ అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో వేంచేసియున్న హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయ 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏసీపీ ఏ.రఘు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు ప్రారంభించగా భక్తులకు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలందించారు. కార్యక్రమంలో దోసపాటి అమరలింగేశ్వరరావు, బొంతు శ్రీనివాసరావు, గుండు ఉమామహేశ్వరరావు, ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రావి నాగేశ్వరరావు, పొలిశెట్టి శివకుమార్, చింతలపాటి సత్యనారాయణ, కూసంపూడి మధుసూదన్‌రావు, నాగళ్ల శ్రీనివాసరావు, భీమిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల సోమేశ్వరరావు, దురిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హరిహరాత్మజ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: సండ్ర

పట్టణంలోని శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి మహా పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. మాల ధరించిన స్వాములు, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, నరుకుళ్ల శ్రీనివాసరావు, చాంద్‌పాషా, వేణు తదితరులున్నారు.



పూజలు చేస్తున్న సండ్ర వెంకటవీరయ్య

కార్పొరేటర్‌కు అశ్రు నివాళి

» పాడెమోసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కాంగ్రెస్ కార్పొరేటర్ మలీదు జగన్ పాడె మోస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండురోజుల క్రితం హైదరాబాదులో గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖమ్మం కార్పొరేషన్ 3వడివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ అంత్యక్రియలు బుధవారం ఖమ్మంలో జరిగాయి. సందర్భంగా ఖమ్మంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు అంతిమయాత్ర నిర్వహించారు. జగన్ మృతదేహానికి నివాళులర్పించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్పొరేటర్ మలీదు జగన్ పాడెను మోశారు. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో తన విజయానికి అహర్నిశలు శ్రమించిన నాయకుడు జగన్ అని నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొని జగన్‌కు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్‌కు చెందిన నిందితుడు షేక్ ఖాదర్‌కు బాలుడిపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10,000ల జరిమాన విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె. ఉమాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాలుడికి జామకాయలు ఇస్తానని చెప్పి ఇంటిలోపలికి తీసుకొనిపోయి నిందితుడు బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని 1-12-2021న ఖమ్మం మొదటి పట్టణపోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టు చేసి కేసును విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్, లైజన్ ఆఫీసర్ రషీద్, హోంగార్డు ఆయూబ్ సహకరించారు.

ఎకో ఫ్రెండ్లీ దీపావళి జరుపుకోవాలి

» ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ

తల్లాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలుగకుండా దీపావళి వేడుకలను జరుపుకోవాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి సూచించారు. బుధవారం తల్లాడ బాలభారతి విద్యాలయంలో పర్యావరణ పరిరక్షణ హితమైన దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ విద్యార్థులు తయారుచేసిన వివిధ క్రాఫ్టవర్క్ తోరణాలు, దీపాలను సందర్శించి అభినందించారు. జవహర్ బాల్‌మంచ్ సంఘం తరపున పది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో వర్షానికి తడిసిన పత్తి



మార్కెట్‌లో వర్షానికి తడుస్తున్న పత్తి బస్తాలు

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి పత్తి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. రైతులకు చెందిన పంట కొనుగోళ్లు జరిగి కాంటాలు ముగిసిన తరువాత అకస్మాత్తుగా భారీ వర్షం రావడంతో సుమారు 1500 నుంచి 2 వేల బస్తాల వరకు తడిసాయి. దీంతో పత్తి ట్రేడర్లకు కొంతమేర నష్టం వాటిల్లింది. రైతులకు చెందిన పంట వర్షంలో తడవక పోవడంతో పత్తి రైతులు, మార్కెట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

దివ్వెల పండుగ నేడే..

దివ్వెల పండుగ దీపావళిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలు నేడు జరుపుకోనున్నారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా ఈపండుగను పాటిస్తారు. నరకాసురుడనే రాక్షసుడిని శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి అంతమొందించి ప్రజలకు పీడ విముక్తి చేసినందుకు గానూ ఈ పండుగ పాటించటం ఆరంభమయ్యిందని చెబుతారు.



» ఇంటింటా వెలగనున్న వెలగనున్న ప్రమిదలు..
» బాణాసంచా కొనుగోళ్లలో ప్రజలు
» దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే బాణాసంచా పండుగ కనుక ఈపండుగ పిల్లలకు మరింత ప్రత్యేకమైనది. టపాసులు కాల్చేందుకు పిల్లలు, యువకులు ఆసక్తిగా ఎదు రు చూస్తున్నారు. పండుగ ఈదఫా నెలాఖరున రావటంతో పాటు ఈనెలలోనే దసరా పండుగను చేయటంతో తల్లి దండ్రులకు దీపావళి బాణాసంచా కొనుగోలు చేయటం కొంత భారంగా ఉన్నప్పటికీ పిల్లల సంతోషాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేస్తున్నా రు. పిల్లలు సైతం తమ తల్లి దండ్రులతో కలిసి బాణా సంచా దుకాణాలను సందర్శిస్తూ తమకు నచ్చినవి ఖరీదు చేస్తున్నారు.

నూనె ప్రమిదలు

పండుగనాడు ప్రతి ఇంటా నూనె దీపాలు కనువిందు చేస్తాయి. గోడలపక్కన, ప్రహరీల మీద, గూటిలో న దీపాలను అమరుస్తారు. చీకటిని జయిస్తూ వెలిగే దీపాలు ఎంతో అందంగా ఉంటాయి.. చిరుదివ్వెలు వెలిగినట్లు ప్రతి ఒక్కరి జీవితాల్లోఆనందాలు వెలగాలని నూతన కాంతులు పరుచుకోవాలని ఆకాంక్షిస్తూ దీపాలను వెలిగిస్తారు. దీపావళి పండుగకు దివ్వెలతోనే నిండుదనం కనుక ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా మట్టి ప్రమిదల విక్రయాలు జోరుగా సాగాయి. కుమ్మరి చేతి వృత్తి కళాకారులు తమ కళా నైపుణ్యంతో తయారు చేసిన మట్టి ప్రమిదలను మహిళలు మక్కువతో కొనుగోలు చేశారు. నేడు ఆ ప్రమిదలలో నూనె పోసి వత్తులు వేసి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించనున్నారు. దీపావళి నాడు దేవాలయాలను సైతం దర్శిస్తారు కనుక జిల్లా వ్యాప్తంగా దేవాలయాలను భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేశారు. దేవాలయాల్లో సైతం దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేశారు.

నీళ్లతో వెలిగే దీపాలు..

నీళ్లతో దీపాలు వెలిగించటం బాబాలు చేసే గారడీలు, మెజీషియన్లు చూపే మేజిక్కు మాత్రమే కాదు.. ఇప్పుడు ఎవరైనా నీళ్లతో దీపాలను వెలిగించి ఆశ్చర్యపరచవచ్చు.. దీపావళి పండుగకుదీపాలే ప్రధాన ఆకర్షణ కాగా కొత్తగా నీళ్ల దీపాలు మరింత ఆకర్షణగా మారాయి..ఎల్ ఈడీ టెక్నాలజీతో రూపొందించిన ఈ ప్లాస్టిక్ ప్రమిదలలో నీళ్ల పోయగానే వెలగటం వీటి ప్రత్యేకత.. ప్లాస్టిక్ ప్రమిదల అడుగు భాగంలో ఎల్ ఈడీ పరికరాన్ని బిగించారు. నీళ్ల పోయగానే సైన్స్ ప్రకారం అవి వెలుగుతున్నాయి. జీరో బల్బు తీరుగా ఇవి వెలుగుతుండటంతో ప్రజలు ఆసక్తితో కొనుగోలు చేస్తున్నారు. ఈ దీపాలను దీపావళి రోజునే కాక దేవుడి చిత్రపటాల ముందు, దేవుడి గూటిలో కూడా అమర్చుతున్నారు.

అకాల వర్షం.. వ్యాపారాలకు కష్టం..

అకాల వర్షం దీపావళి విక్రయాలకు అవరోధంగా మారింది. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురవటంతో దీపావళి బాణాసంచా విక్రయాలతోపాటు, ఇతర వ్యాపారాలకు ఇబ్బంది ఏర్పడింది. పండుగ ఒక్కరోజే ఉండటంతో బుధవారం చాలా మంది టపాసుల కొనుగోళ్లకోసం బాణాసంచా దుకాణాలను సందర్శించగా వర్షం ప్రారంభం అవటంతో కొనుగోలు చేసిన టపాసులు తడిచాయి. దుకాణాల్లోకి సైతం జల్లు కురవటంతో వ్యాపారులు సమస్యలకు గురయ్యారు. బాణాసంచాలను తాత్కాలిక దుకాణాల్లో ఏర్పాటు చేస్తారు కనుక గాలి, వర్షానికి జల్లు కొట్టి కొంత అసౌకర్యం కలిగింది. మరో వంక రోడ్లపై మట్టి ప్రమిదలు, నూనె వత్తులు, క్యాండిల్స్ తదితర దీపావళి పండుగ వస్తువులును విక్రయిస్తున్న వారు ఇక్కట్ల పాలయ్యారు.

వైరాలో చేపల కాంట్రాక్టు రద్దు



మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి శివప్రసాద్

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో చేపల కాంట్రాక్టర్ ఒప్పందాన్ని రద్దుచేశారు. బుధవారం వైరా మత్స్య విత్తనోత్పత్తి కేంద్రంలో జిల్లా మత్స్యశాఖ అధికారి జి. శివప్రసాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జనరల్‌బాడీ సమావేశంలో చేపల కాంట్రాక్టు రద్దు విషయాన్ని ప్రకటించారు. వైరా చేపల సొసైటీ పాలకవర్గం వైరా రిజర్వాయర్‌లో చేపల వేట కాంట్రాక్టుకు సంబంధించి మూడుసంవత్సరాల కాలపరిమితితో చేసుకున్న ఒప్పందంపై సభ్యులు మోట తిరుమలరావు సహా పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ జనరల్‌బాడీ సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

ఈ సమావేశంలో సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నారు. చేపల కాంట్రాక్టర్ తమను బెదిరిస్తున్నాడని కొంతమంది సభ్యులు ధ్వజమెత్తారు. దాంతో చేపల కాంట్రాక్టును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే తమ అధికారాలకు మించి అన్నీతామే అయి వ్యవహరిస్తున్న చేపల సొసైటీ పాలకవర్గాన్ని రద్దుచేయాలనే ప్రతిపాదనను సమావేశం ముందు ఉంచగా ఒకరిద్దరు సభ్యులు మినహా మెజార్టీ సభ్యులు సుముఖత వ్యక్తం చేయలేదు. దాంతో చేపల సొసైటీ పాలకవర్గం రద్దు ప్రతిపాదన వీగిపోయింది. ప్రభుత్వానికి ఈ ఏడాది లీజు సొమ్ము చెల్లించకుండా చేపల వేట కొనసాగించొద్దని అలా చేసిన పక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. అయితే తమకు పదిరోజుల గడువు కావాలని సభ్యులు కోరారు. చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్.రహీం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు మధుకాలేజీ విద్యార్థిని



వేదశ్రీని అభినందిస్తున్న మల్లెంపాటి వీరభద్రరావు

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరులో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడలకు (స్కేటింగ్) తెలంగాణ రాష్ట్రం నుంచి ఖమ్మంజిల్లా వైరాలోని మధు జూనియర్ కాలేజీ విద్యార్థిని వాసిరెడ్డి వేదశ్రీ ఎంపికైంది. ఈనెల 29న సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 స్కేటింగ్ టోర్నమెంట్ బాలికల విభాగంలో వేదశ్రీ ప్రథమ స్థానం సాధించింది. మధు జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వేదశ్రీ క్రీడలు, చదువులో రాణిస్తుంది. వేదశ్రీని మధు జూనియర్ కాలేజీ చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు మల్లెంపాటి ప్రసాదరావు, కరస్పాండెంట్, ట్రెజరర్ మల్లెంపాటి రంజిత్, నర్మద, ప్రిన్సిపాల్స్ రాంబాబు, చారి, పీడీ సత్యనారాయణ అభినందించారు.

లాభసాటి ప్రత్యామ్నాయ పంటలపై

రైతుల దృష్టి మరల్చాలి

» కూరగాయలు, పండ్లు, ఆయిల్‌పామ్ పంటల సాగు విస్తరించాలి
» ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లాభసాటి ప్రత్యామ్నాయ పంటల దిశగా రైతుల దృష్టి మరల్చాలని దీనికి ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంట సాగులను ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృతంగా అవగాహన చేపట్టాలన్నారు. ఆయిల్‌పామ్ పంటల సాగు వల్ల కలిగే లాభాలు రైతులకు పూర్తిగా వివరించాలని కలెక్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు.

వ్యవసాయాన్ని లాభ సాటిగా చేయడం ద్వారా సమాజంలో అంతరాలను తగ్గించవచ్చని, గ్రామీణ ప్రాంతాలలో మనం విప్లవం సాధించేందుకు మన దగ్గర ఉన్న జ్ఞానాన్ని క్షేత్ర స్థాయికి తీసుకొని వెళ్లాలన్నారు. వరి పంట సాగు విస్తీర్ణం తగ్గించాలని, దీనికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ఆయిల్‌పామ్ పంటల సాగుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పామాయిల్ పంటకు కూలీల అవసరం లేదని, పురుగుల మందు బాధ ఉండదని, కోతుల, జంతువుల బెడద ఉండదని, అధిక లాభాలు ఉంటాయని అన్నారు. రాబోయే నెల రోజులలో జిల్లాలోని ప్రతి క్లస్టర్ పరిధిలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఇద్దరు రైతులచే కొత్తగా ఆయిల్ పామ్ పంట వేసేలా వ్యవసాయ విస్తరణ అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎంవీ మధుసూదన్, వ్యవసాయశాఖ డివిజన్, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులను చూపుతున్న ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట బుధవారం లొంగిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాకు చెందిన సోడి పొజ్జి అలియాస్ చింత(25), మడివి సోమిడి అలియాస్ రమ్య(22) లొంగిపోయారు.

ఏరియాకమిటీ సభ్యురాలుగా ఉన్న సోడి పొజ్జి నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ భద్రాద్రి జిల్లా, అల్లూరి సీతారామరాజు డివిజన్‌లోని చర్ల ఎల్‌వోఎస్ కమాండర్‌గా పని చేసింది. ఆమె సోదరుడు సోడి జోగయ్య ప్రోత్సాహంతో 2017 సంవత్సరంలో చర్ల ఎల్‌వోఎస్‌లో దళసభ్యురాలిగా చేరింది. 2021లో ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోషన్ పొంది, 2023 వరకు మావోయిస్టు పార్టీకి చెందిన చైతన్య నాట్యమండలి (సీఎన్ఎం)కమాండర్‌గా పని చేసింది. చర్ల ఎల్‌వోఎస్ కమాండర్‌గా పని చేసిన మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్ 2023లో మృతి చెందాక ఆ బాధ్యతలను పొజ్జి తీసుకుంది. ఏరియాకమిటీ సభ్యురాలైన మడవి సోమిడి 2019లో చర్ల మిలిషియా కమాండర్ లేట్ జోగయ్య ఆధ్వర్యంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో చేరింది. 2021లో మణుగూరు ఎల్‌జీఎస్‌కు ఆమెను బదిలీ చేసి 2024 మే నెలలో ఏరియా కమిటీ మెంబర్‌గా ప్రమోషన్ పొంది ఎల్‌జీఎస్ కమాండర్‌గా ఇప్పటి వరకు పని చేసింది. వీరిద్దరు నిషేధిత మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ దళ సభ్యులుగా చేరి ఏరియాకమిటీ సభ్యులుగా ప్రమోషన్ పొందారు. ఇప్పటి వరకు ఒకరు చర్ల ఎల్ఎస్‌వో కమాండర్‌గా మరొకరు మణుగూరు ఏరియా ఎల్‌జీఎస్ కమాండర్‌గా పని చేశారు. వీరి ఒక్కొక్కరిపై రూ.4లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఓఎస్‌డీ సాయిమనోహర్, దుమ్ముగూడెం సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి..

» కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలందరు ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని, ఈ పండుగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకురావడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు ఆకాంక్షించారు. గురువారం దీపావళి పండుగను పురష్కరించుకుని జిల్లాలోని ప్రజలకు కలెక్టర్, ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ అంటే దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా పండుగను జరుపుతామని, దీపావళి రోజున లక్ష్మి, సరస్వతి పూజలు చేసి ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో ఉంటారన్నారు. బాణాసంచా విషయంలో పిల్లల పట్ల పెద్దలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలి

» భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

కొత్తగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వచ్చే నెల 6 నుంచి ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలోని తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల సాటిస్టికల్ ఆఫీసర్స్, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లకు ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలక్షల మంది జీవితాల్లో మార్పు తీసుకుని వస్తుందని, అధికారులు వివరాలను సేకరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రాజకీయ కుల వివరాలను సేకరించాలన్నారు. ప్రజల యొక్కజీవన స్థితి, ఇతర పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడుతుందన్నారు. దీని ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సర్వేలో ప్రజల నుంచి తీసుకోవాల్సిన వివరాలు, ఇతర అంశాలపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన ఉండాలన్నారే. సర్వేలో భాగంగ్రాపతి బ్లాక్‌లోని అన్ని కుటుంబాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్య, ఇంటి నెంబరు, ఇంటి యజమాని పేరు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తదితర వివరాలు ఫారంలో నమోదు చేయాలన్నారు. ఇంటి సర్వే పూర్తి అయిన వెంటనే వివరాలు నింపిన స్టిక్కర్‌ను ఇంటి గోడపై అతికించాలన్నారు. ఎన్యూమరేషన్ అయిన తర్వాత నింపిన షెడ్యూల్ ఫారంను జాగ్రత్తగా భద్రపర్చాలని, ఎన్యుమరేటర్ తనకు నిర్దేశించిన డేటాఎంట్రీ కేంద్రానికి వెళ్లి ఆపరేటర్‌తో డేటా ఎంట్రిని పూర్తి చేయాలన్నారు. డేటా ఎంట్రీ సమయంలో ఎటువంటి పొరపాట్లు తావు లేకుండ జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఎంటర్ చేసిన డేటాను ఎట్టి పరిస్థితుల్లో ఎవరితో పంచుకోకూడదని, సిబ్బందికి ఆదేశించారు. సర్వే సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే పూర్తి అధికారులకు తెలియచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

ఇందిరమ్మ కమిటీల్లో ఇతర పార్టీలకు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణ



ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీ

దుమ్ముగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలం రేగుబల్లి, దంతెనం గ్రామాల్లో బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిశాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకులను పక్కన పెట్టి బీఆర్ఎస్, సీపీఐ నాయకులకు స్థానం కల్పించారని అర్థం వచ్చేలా ఫ్లెక్సీలు డిజైను చేయించారు. ఈనెల 27న గంగోలు రైతువేదిక వద్ద తెలంగాణా ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొన్న యువజన సదస్సులో కొందరు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీల్లో ఎమ్మెల్యే వెంకట్రావు ప్రోద్బలంతో పార్టీకి జరిగిన అన్యాయాన్ని వినతిపత్రం ద్వారా అందజేశారు. ఇప్పటికే మండల కేంద్రం లక్ష్మీనగరంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, తాజా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వర్గాల నాయకులు వేర్వేరుగా రెండు పార్టీ కార్యాలయాలు నడుపుతున్నారు. మంత్రులు బట్టి, పొంగులేటి వర్గాల పేరిట జరుగుతున్న ఈ వర్గపోరు చర్చనీయాంశమైంది. స్థానిక ఎన్నికల దృష్ట్యా రోజురోజుకూ పెట్రేగిపోతున్న వర్గపోరుకు అంతం పలికితే బాగుంటుందని కాంగ్రెస్ కార్యకర్తలు భావిస్తున్నారు. అలాగే ఏళ్లతరబడి పార్టీలో ఉంటూ, పార్టీ గెలుపునకు చెమటోడ్చి పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తల్ని పక్కనబెట్టి, వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారనే అసంతృప్తి సైతం కొందరు కార్యకర్తల్లో ఉంది. సంవత్సరాల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలను నాయకులు పట్టించుకోవడం లేదనే ఆవేదన వ్యక్తం అవుతోంది. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పార్టీకి పెద్ద నష్టాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇంటింటికి తిరిగి ఓట్లు వేయించిన వారిని నాయకులు పట్టించుకోవడం లేదని, బయటి వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని అంటున్నారు.